# బంధం

తెల్లవారబోతూంది.

క్రితం రాత్రి వరకూ వేడి గాడ్పులతో భయ పెట్టిన ప్రకృతి ఒక్కసారిగా జల్లుకురిసి చల్లబడి, బిడ్డమీద కోపం వచ్చి అంతలోనే తగ్గిపోయిన తల్లిలా మానవజాతిని తనచల్లని ఒడిలోకి తీసుకుని సేదదీరుస్తున్నట్టుంది.

మంచంపైనుంచి లేవబుద్ధి కావడం లేదు చరణ్‌కి. అలాగే బద్ధకంగా ఒత్తిగిలి పడుకుని కిటికీలోంచి బయటికి చూసాడు. ఆ ఉదయం ప్రశాంతమైన వాతావరణంలో శ్రావ్యంగా కిల కిలారావాలతో స్వేచ్ఛగా ఎగిరిపోతున్న పక్షులను చూసి అనుకున్నాడు... "వీటిని చూసి మనుషులు నేర్చుకోవలసింది చాలా ఉంద"ని.

దిండు క్రింది 'సెల్' అందుకుని స్వప్న నెంబర్ డయల్‌చేసాడు.

'హలో శుభోదయం... అయ్యగారింకా పడక సీన్లోనే ఉన్నట్టున్నారు?' స్వప్న హుషారుగా పలకరించింది.


'అరె... నీకెలా తెలుసు...?' ఆశ్చర్యపోయాడు.

'తమరెప్పుడైనా ఎనిమిది దాటంది మంచం దిగారా?' వెక్కిరింతగా అంది.

'అది సర్లే స్వప్నా... ఈ కిటికీలోంచి చూస్తూంటే గుంపులుగా కదిలివెళ్లిపోతున్న స్వేచ్ఛావిహంగాలు బోలెడు కనబడుతున్నాయి. వీటిని చూసి మనుషులు ఎంతో నేర్చుకోవాలి కదూ!'

'ఏం నేర్చుకోవాలో' అడిగింది.


'ఒక స్టేజి దాటాక తల్లి పక్షులు, పిల్ల పక్షులూ ఎంచక్కా వేటిదారిన అవి వేరై వెళ్లిపోతాయి. మనకులాగా స్వంత ఊరు, దేశం, అమ్మా నాన్నా అంటూ ఒకే గూటిని పట్టుకుని వేళ్లాడవు' అన్నాడు.




'ఏడిచినట్టే ఉంది... పక్షులను చూసి ఇదా నువ్వు నేర్చుకునేది? ముందు వాటి పంక్చువాలిటీని నేర్చుకో చాలు...' కోపంగా అనేసి చప్పున ఫోన్ కట్ చేసింది.


స్వప్నకు బాగా కోపం వచ్చింది అనుకున్నాడు. గత కొన్నాళ్లుగా చరణ్‌కి, చరణ్ తండ్రి వెంకటరామయ్యకూ మధ్య ఓ విషయం నలుగుతూనే ఉంది. స్వప్న మాత్రం ఎంతసేపూ వెంకటరామయ్యనే సపోర్ట్ చేస్తుంది. గతరాత్రి తనకూ తండ్రికీ జరిగిన సంభాషణ గుర్తొచ్చింది చరణ్‌కి...

"బాబూ... నీ సంపాదన ఆశించి కాదు... నిన్ను ఇన్నాళ్లూ కష్టపడి చదివించి డాక్టర్ని చేసింది. మనూరి బళ్లో పిల్లలు చదువుమానేసి పొలం పనులు చేసుకోవడానికి తల్లిదండ్రులకు సాయం వెళ్లినప్పుడునువ్వు మాత్రం 'నాన్నా... నేను పెద్ద డాక్టర్నయ్యా అందరి రోగాలూ నయం చేస్తానని ముద్దుగా పలికేవాడివి. నీ ఇష్టప్రకారమే నిన్ను చదివించాను..."



“సరే నాన్నా... ఒప్పుకున్నా! నువ్వు నన్ను కష్టపడే చదివించావు. మరిప్పుడు మంచి అవకాశం వచ్చి నేను స్టేట్స్‌కి వెళ్తానంటే కాదంటావు. విదేశాల్లో అయితే నెలసరి ఆదాయం లక్షలు దాటుతుంది. ఇక్కడిలా గొర్రెతోక సంపాదనతోనో అసలుద్యోగం లేకో కష్టాలు పడక్కర






లేదు. నేను సంపాదించాలనుకున్నదీ నీ కోసమే కదా నాన్నా! నేను వెళ్లాక డబ్బు పంపుతానో లేదోనని నీకనుమానమనుకుంటాను”.

“ఛ... అదేం మాటరా...! నొచ్చుకున్నాడు వెంకటరామయ్య. చరణ్ ఆయన ఏకైక సంతానం. పుట్టిన ఏడాదికి తల్లిని పోగొట్టుకుంటే, తన కొడుకుని వేరెవరైనా వస్తే సరిగ్గా చూస్తారో లేదోనని ఆయనసలు మళ్లీ పెళ్లి సంగతే తల పెట్టలేదు. ధ్యాసంతా కొడుకు మీదే అనేకంటే ఆయన ప్రాణమే చరణ్ అనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఉన్న కొద్దిపాటి పొలాన్నీ పండించుకుంటూ ఓ పూట తిని, మరోపూట తిన

**స్వరూప్ సిన్హా**

కా... చరణ్‌కి మాత్రం ఏలోటూ రాకుండా అల్లారుముద్దుగా పెంచాడు.

"నేను ముందుగా వెళ్లి ఉద్యోగంలో చేరి వచ్చి నిన్ను తీసుకువెళతాలే" అన్నాడు చివరకు చరణ్.

"ఒరే బాబూ... నువ్వు కావాలంటే వెళ్లు. నేను మాత్రం రాను. నువ్వేమీ నాకు డబ్బు కూడా పంపనక్కరలేదు. ఏదో ఉన్నంతలో ఆ దేవుడి దయవల్ల నేను బాగానే బతగ్గలను... నువ్వు గొప్ప డాక్టరువైతే నాకంతే చాలు..." అన్నాడాయన దృఢంగా.

"ఛ... నీ మాటలకర్థంలేదు నాన్నా... నన్నూ వెళ్లొద్దంటావు, నువ్వూ రానంటావు. ఈ వయసులో ఇంత మొండితనం పనికిరాదు నీకు" కోపంగా అన్నాడు చరణ్.

"ఒరేయ్ బాబూ... ఈ నేల, ఈ గాలి, ఈ ఇల్లు, ఈ ఊరు ఇవన్నీ నేను పుట్టినప్పట్నించీ నా నేస్తాలురా! నా తల్లిదండ్రులు, మీ అమ్మా... వీరందరి జ్ఞాపకాలూ ఈ నేలతో ముడిపడి ఉన్నాయి. నేను పోయేవరకూ అవి అలానే ఉంటాయి. నేను మాత్రం ఈ గడ్డనొదిలి రాలేను..."

"సరే నాన్నా... నీ ఖర్మ... ప్రతివాడూ కోట్లకు పడగలెత్తి డెవలప్ అవుతూంటే, ఇక్కడ ఏమీ చాతకాని వాజమ్మలా నేను చేతులు ముడుచుకుని కూర్చోలేను. అమెరికాలో సెటిలవ్వాలన్నది నా కల! దాన్ని నేను ఎవరికోసమూ త్యాగం చేయలేను. నువ్వూ నాతోపాటు వస్తావో రావో నువ్వే నిర్ణయించుకో. రెండు రోజులయ్యాక మనూరు వస్తాను. అప్పుడు చెప్పు నీ నిర్ణయాన్ని" చెప్పాడు చరణ్.

"సరే నీ ఇష్టం బాబూ! నీకెలా చేయాలనిపిస్తే అలాగే చెయ్యి. అయితే నాకు మిగిలి పోయిన ఆ ఒక్క ఆశా తీర్చేసివెళ్లు" దీనంగా, అర్థింపుగా ధ్వనించిందాయన గొంతు.

"పెళ్లే కదా... తప్పకుండా చేసుకుంటాను. స్వప్న చదువు కూడా ఈ ఏడాది పూర్తవుతుంది. ఇద్దరమూ డాక్టర్లమే కాబట్టి అక్కడ స్టేట్స్‌లో మా జీవితం హాయిగా గడిచిపోతుంది. మా గురించి నువ్వేం బెంగ పడక్కరలేదు". ఇక మాట్లాడేదేమీ లేనట్టు లేచినుంచున్నాడు చరణ్.


"బాబూ... మీ అమ్మ చనిపోయి నువ్వు పసిగుడ్డుగా ఉన్నప్పట్నుంచీ నేను నిన్ను అంటిపెట్టుకునే ఉన్నానురా... నువ్వెళ్లిపోతే నేను ఒంటరినైపోతాను... ఒంటరినైపోతాను. నాకెవ్వరూ లేరు... నువ్వు నా దగ్గరే ఉండరా. చిన్నప్పుడు నిన్నెంత మురిపెంగా పెంచుకున్నానో – నిన్నూ నీ కుటుంబాన్నీ కూడా పెంచుకుంటాన్రా... మీకే లోటూ రానివ్వను!" అంటూ మరొక్కసారి ప్రాధేయపడాలనుకున్నాడు. చరణ్‌ని గుండెలకు పొదుముకుని కరువుతీరా ఏడ్చెయ్యాలనుకున్నాడు. కానీ దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. జారుతున్న కన్నీటిని ముంజేతితో తుడుచుకుంటూ చెప్పాడాయన...

"సరే బాబూ నీ ఇష్టం. నేనూరు వెళ్లేలోగా ఒక్కమారు స్వప్నని ఇక్కడికి పిలువు. మీ అత్తామామల్ని కలిసి ముహూర్తాలు నిర్ణయించుకుందాం..."

భార్య పుట్టిన రోజు కోసం కేక్ ఆర్డరివ్వడానికి బేకరీకి వచ్చాడు భర్త.

'సార్... కేక్ మీద ఎన్ని కొవ్వొత్తులు పెట్టమంటారు? అడిగాడు షాపతను.

ఎప్పటిలా ముప్పైయ్యమూడే పెట్టండి. ఆ వయసు దాటిపోవడం ఆమెకు నచ్చదు. బదులిచ్చాడు భర్త.




క్రితం రోజు జరిగిన సంభాషణను తలచుకుంటూ పడుకున్న చరణ్‌కి హఠాత్తుగా గుర్తొచ్చింది. ఆ రోజు ఆదివారమని, స్వప్న వస్తానన్న రోజని... ఒక్క ఉదుటున దుప్పటి ప్రక్కకు తోసి లేచి కూర్చున్నాడు. హుషారుగా ఈల వేసుకుంటూ టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి దూరాడు.

స్వప్న అతని మేనమామ కూతురే కాదు... చిన్ననాటి నుంచీ మంచి నేస్తం కూడా! చిన్ననాటి స్నేహం. బంధుత్వం... ప్రేమ బంధంగా మారడానికెంతో కాలం పట్టలేదు.

తను స్టేట్స్‌కి అప్లయ్ చేస్తున్నట్టు ముందుగా స్వప్నతో చెప్పలేదు. నిన్ననే ఆర్డర్స్ వచ్చాయి. ఈ శుభవార్తను స్వప్న రాగానే చెప్పి సర్‌ప్రయిజ్ చేయాలి. భవిష్యత్‌లో తానూ స్వప్నా గడపబోయే అందమైన జీవితాన్ని గురించి ఆలోచిస్తూ ఒకింత ఆలస్యంగానే స్నానం పూర్తి చేసాడు చరణ్.

అంతలో స్వప్న రానే వచ్చింది. ఆమెతో పాటే వెంకట్రామయ్యగారు కూడా! గబగబా డ్రెస్ చేసుకుని, తనకొచ్చిన ఆర్డర్స్ కవరు స్వప్న చేతిలో ఉంచి విజయగర్వంతో చూసాడు చరణ్. స్వప్న నెమ్మదిగా చదువుతూంటే ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి.. చదవడం పూర్తయ్యాక నిరాసక్తంగా ఆ లెటర్‌ని మడిచి కవర్‌లో పెట్టేసింది.

“ఇంత గుడ్‌న్యూస్ నీముందుంచితే కనీసం కంగ్రాట్స్ కూడా చెప్పాలనిపించలేదా” చరణ్ ముఖం మాడ్చుకుని అడిగాడు.

“అది నీకు గుడ్‌న్యూస్ కావచ్చు. నాకు కాదు!” నిర్మొహమాటంగా చెప్పింది.

చరణ్, వెంకట్రామయ్యగారూ ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యంగా చూసారామెవైపు.

“అదేమిటి? నీకు స్టేట్స్‌లో సెటిలవ్వాలని లేదా?” అడిగాడు చరణ్ తేరుకుని.

"అలా అని నేనెప్పుడూ చెప్పలేదే! నువ్వలా ఎందుకనుకున్నావు?"

"మరి కూపస్థమండూకంలా ఇక్కడే ఇలాగే ఉండిపోతావా? జీవితంలో పైకి రావాలని లేదా?" వెటకారం ధ్వనించింది చరణ్ గొంతులో.

"ఏది పైకి రావడమంటే? పరాయి దేశంలో పరాయి పంచన బ్రతకడమా? మళ్లీ బానిసత్వంలో మగ్గాలనే ఆలోచనలో ఉన్నట్టున్నావు!"

"అర్థం లేకుండా మాట్లాడకు. ఇది ఈ రోజుల్లో కామన్. లైఫంటే విదేశాల్లోనే లైఫ్! ఇక్కడ కాదు".

"అది నీ అపోహ! నేను మాత్రం కష్టపడి సీటు తెచ్చుకుని మెడిసిన్ చదివింది మన దేశంలో పేదలకు సేవ చేయడానికే" దృఢంగా చెప్పింది స్వప్న.

"మూర్ఖంగా వాదించకు. జీవితాంతం పేదలకు సేవచేస్తూ ఉంటే మనం పేదరికంతో చావాల్సి వస్తుంది. మనం ఎవరికోసమో ఎందుకు జీవించాలి? మన జీవితం – మనిష్టం!"

"అలా అన్నావు బావుంది. మామయ్య ఇంతకాలం తనకోసం కాక నీకోసమే జీవించి, నిన్ను ఇంత వాణ్ణి చేసాడు. ఆయన పట్ల నీకు బాధ్యత లేదా?"

"లేదని ఎవరంటున్నారు? నాన్న మనతో రానంటున్నాడు. నాన్న ఇక్కడే సుఖంగా ఉండేలాగా ఏర్పాట్లు చేసే వెళదాం... నాకు బాధ్యత ఎందుకులేదు? ఆయన రానని మొండికేస్తే నేనేం చేయగలను?"

"చూడు డాక్టర్ చరణ్... నువ్వు మెడిసిన్ చదివి పెద్ద డాక్టరువైపోయావు గానీ ఒక చిన్న విషయాన్ని మరిచిపోయావు. అదే 'మానవత్వా'న్ని!"

"ఏమిటి నువ్వు చెప్పేది?"

స్వప్న చెప్పింది... చాలా నెమ్మదిగా, స్పష్టంగా.

"ఒక చెట్టు మహావృక్షమై నిలిచి, తను బ్రతుకుతూ పది మందికి నీడనిచ్చి ఒకచోట స్థిరంగా ఉన్నప్పుడు దాన్ని వేళ్లతో సహా పెకలించుకుపోయి, నువ్వు వేరే చోట నాటి పెంచాలని చూసినా అది పెరగదు. చనిపోతుంది. మామయ్యకు ఓ స్థిరత్వం, హుందాతనం ఉన్నాయి. ఆయనేం చిన్నపిల్లాడు కాదు – మనతోపాటు వచ్చేయడానికి. ఈ వయసులో ఆయన వ్యక్తిత్వం ఎంతో స్థిరంగా ఉంటుంది. మనలా డోలాయమానంగా ఉండదు. అందరూ నీలా పరిసరాలకు అనుగుణంగా వెంటనే మారిపోలేరు. ఆయన 'సెంటిమెంట్స్'ని గౌరవించాల్సిందిపోయి... ఛ" ఆపైన మాట్లాడలేక పోయింది స్వప్న. వెంకట్రామయ్య గారు చెమర్చిన కళ్లతో కృతజ్ఞతగా చూసారు.

చరణ్‌కి ఏం మాట్లాడాలో తెలియలేదు.

మళ్లీ స్వప్నే అంది.

"బాగా బ్రతకాలనుకోవడంలో తప్పులేదు. కానీ దానికి మరీ అంత 'మెటీరియలిజం' అక్కరలేదు. ఒకవేళ మామయ్య కూడా నీలాగే ఆలోచించి ఉంటే నువ్వెక్కడుండే వాడివో తెలుసా? అనాథశరణాలయంలో..."

దెబ్బతిన్నట్టుగా చూసాడు చరణ్.

"అమ్మా స్వప్నా... ఎందుకులేమ్మా అంతంత మాటలు... అబ్బాయి ఇష్టప్రకారమే కానివ్వు! అమ్మానాన్నలతో మాట్లాడి – ముహూర్తాలు

పెట్టుకుందామని చెప్పడానికి నిన్ను రమ్మన్నానే గానీ... బాబు మనసు నొప్పించడానికి కాదు తల్లీ!" నొచ్చుకున్నారాయన.

స్వప్న అంది - "చూడు చరణ్... మామయ్య ముఖాన్ని ఒక్కసారి చూడు! నువ్వెంత నిర్లక్ష్యంగా మాట్లాడినా ఆయన నీ సుఖాన్నే కోరుకుంటున్నాడు గానీ నిన్ను పల్లెత్తుమాట అననివ్వడం లేదు. అదీ కన్నప్రేమ అంటే... పసితనంలో మనం ప్రతిదానికీ తల్లిదండ్రుల పైనే ఆధారపడతాం. అలాగే వారు పెద్దయ్యాక పసివాళ్లవుతారు. అప్పుడు మనమే తల్లి దండ్రులమై వారిని పెంచగలగాలి. అలా చేయలేని నాడు ఈ మానవజన్మకు అర్థంలేదు. మన చదువులన్నీ నిరర్థకం..."

ఆ క్షణం వెంకట్రామయ్య గారికి స్వప్న తన తల్లిలా కనిపించింది. ముఖాన్ని చేతుల్లో దాచుకుని పసిపిల్లాడిలా బావురుమన్నాడాయన. అనునయంగా ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుని చెప్పింది...

"చరణ్... ప్రశాంతంగా ఆలోచించు. పరాయిదేశం నీకంత అందంగా కనిపిస్తూ సొంతగడ్డ అంత అసహ్యంగా ఉంటే... నీ యిష్టం... 'అమ్మ'నే అసహ్యించుకునే విష సంస్కృతికి నువ్వు స్వాగతమే పలుకుతావో... నీ ఇష్టానికే వదిలేస్తున్నాను. తొందరేం లేదు... స్థిమితంగా ఆలోచించుకో! మనం బావా మరదళ్లమైనా ఏనాడూ వరసలు పెట్టుకుని పిలుచుకోలేదు. చిన్నప్పట్నుంచీ... ప్రాణ స్నేహితులుగానే పెరిగాం... అందుకే ఓ ఫ్రెండ్‌గా సజెస్ట్ చేస్తున్నాను చరణ్... నీ ఆలోచనాధోరణి సరియైనదో కాదో నువ్వే నిర్ణయించుకో... అంతవరకూ మామయ్య మా ఇంట్లోనే ఉంటారు. "పదండి మామయ్యా..." వెంకట్రామయ్య గారి చేతిని అందుకుని నెమ్మదిగా నడిపించుకు వెళ్తోంది స్వప్న...

అంతలో వెనక నుంచి చరణ్ గద్గద స్వరంతో పిలిచాడు "నాన్నా...".

వెంకట్రామయ్యగారు ఆశ్చర్యంగా అటు తిరిగారు.

ఒక్క ఉదుటున వచ్చి ఆయన గుండెలపై వాలిపోయి బావురుమన్నాడు చరణ్.

"నన్ను క్షమించు నాన్నా... నన్ను క్షమించు..." పసిపిల్లాడిలా ఆయన గుండెల్లో ఒదిగిపోయి వెక్కి వెక్కి ఏడిచాడు చరణ్.

'బాబూ... ఊరుకోరా... నువ్వేడిస్తే నేను చూడలేను... తండ్రీ... ఊరుకోరా...!" ఆయన అమూల్యమైన పెన్నిధి చేజారబోయి తిరిగి దక్కినట్టుగా అపురూపంగా, మరింతగాఢంగా తన బిడ్డని గుండెకు హత్తుకుని రోదించసాగారు... నుదిటిపై ముద్దుల వర్షం కురిపించారు...

కళ్లు తుడుచుకుంటూ ఆ ప్రేమ బంధాన్ని తనివితీరా చూస్తూ నిల్చుంది స్వప్న... ●

తన భర్త పుట్టినరోజుకి ఏదైనా కానుక ఇవ్వాలనుకుందో భార్యామణి. రాత్రి భర్తతో అదీ ఇదీ మాట్లాడుతూ 'మీకిష్టమైన దేమిటి?...' అడిగింది గోముగా -

దానికాభర్త - 'నీలాకాశం, వెన్నెల్లో చంద్రుడు, పచ్చని చేలూ, పల్లె ప్రాంతాలూ... అంటూ చెప్పుకు పోతూండగా-

అబ్బ... అంతేనా? ఇంకేం లేవా? విసుక్కుంది.

ఎందుకులేవూ... జాస్తి కారం వేసిన ఆవకాయ, పచ్చిపులుసు, ఎండు మిరప...